ధరల దరువు

- భారీగా పెరిగిన నిత్యావసర నరకుల ధరలు
- గగ్గోలు పెడుతున్న ప్రజలు



నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. 20 రోజుల కిందట ధరలతో పోలిస్తే రోజురోజుకూ పెరుగుతున్నాయి. టమాటా మాట వినడం లేదు. అల్లం ధర అమాంతం పెరిగి పోయింది. ఉల్లి కన్నీరు పెట్టిస్తోంది. దొండకాయలు కూడా కిలో రూ.50కు చేరడంతో సామాన్యులు బజారుకు వెళ్లడానికి జంకుతున్నారు.

గోపాలపట్నం: కాయగూరల ధరలు ప్రజల జేబులకు గాయాలు చేస్తున్నాయి. ఏం కొనేటట్టు లేవని.. ఏమీ తినేటట్టు లేని పరిస్థితి నెలకొందని కొనుగోలు దారులు వాపోతున్నారు. రైతు బజారులో టమాటా ఠారెత్తిస్తుంటే...బహిరంగ మార్కెట్‌లో భయపెట్టిస్తోందంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లి, దుంపలు, వెల్లులి వంటివి అదే దారిలో పరుగు పెడుతున్నాయి. మార్కెట్‌లోకి కాయగూరలు సైతం అంతంత మాత్రంగా వస్తుండడంతో ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో కొనుగోలు దారులు ఇబ్బందులు పడుతున్నారు. కిలో కొనుగోలు చేసేవారు అర కిలోతో సరిపెట్టుకుంటున్నారు. రైతు బజారులు కంటే బహిరంగ మార్కెట్‌లో కిలోకు రూ.20 నుంచి రూ.40 వరకు వ్యత్యాసం ఉండడంతో ఎక్కువ మంది రైతు బజార్ల వైపే మొగ్గు చూపుతున్నారు. ధరలు పెరుగుదలకు రాష్ట్రంలో పంట తగ్గుదల, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి కూడా తగ్గడం కారణమని వ్యాపారులు చెబుతున్నారు. ఈ పరిస్థితి ఇంకెన్ని రోజులు ఉంటుందోనని సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గోపాలపట్నం రైతుబజారులో టమాటాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



రైతుబజారులో ధరల పట్టికను చూస్తున్న వినియోగదారుడు

నరకు	రైతుబజారు ధర కిలో	బహిరంగ మార్కెట్
ఉల్లిపాయలు (పాతవి)	రూ.36	రూ.56
టమాటా దేశవాలీ		
మొదటిరకం	రూ.66	రూ.88
రెండో రకం	రూ.58	రూ.70
వంకాయలు		
నలుపు	రూ.54	రూ.65
తెల్లవి	రూ.50	రూ.60
బెండకాయలు	రూ.46	రూ.66
పచ్చిమిర్చి	రూ.62	రూ.80
బజ్జీ మిర్చి	రూ.84	రూ.100
బంగాళదుంపలు	రూ.30	రూ.45
అల్లం పాతది,		
కొత్తది ఒక రకం	రూ.160	రూ.180
రెండో రకం	రూ.140	రూ.160
బరబాటి	రూ.64	రూ.80
గోరు చిక్కుడు	రూ.38	రూ.50



బుచ్చిరాజుపాలెంలో కాయగూరల దుకాణం

కూరగాయలు కొనలేకపోతున్నాం



బజారులో కాయగూరలు కొనలేక పోతున్నాం. టమాటా ధర చాలా దారుణంగా ఉంది.15 రోజుల్లో వ్యవధిలో బాగా పెరిగింది. ఇదే పరిస్థితి కొనసాగితే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ధరలు నియంత్రించడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి.

– నీలాపు శ్రీనివాసరావు, వెంకటాపురం

పెద్ద నోటు తీసుకెళ్లినా..



రూ.500 నోటు తీసుకెళ్లే కనీసం చేతి సంచి కూడా నిండడంలేదు. టమాటా ఏకంగా రూ.70కి చేరువలో ఉంది. మిగిలిన సరకులు కూడా ఐదోపదో తేడాతో పరుగులు తీస్తున్నాయి. నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. సామాన్యుడికి కూరగాయల కొనడం భారంగా మారింది.

-బొడ్డేపల్లి హేమలత, దుర్గానగర్

జాగ్రత్తగా వాడుతున్నాం

టమాటా ధర పెరగడంతో పొదుపుగా వాడుతున్నాం. బయట మార్కెట్‌లో కిలో రూ.80 ఉంది. రెండు మూడు కిలోలు కొనేదాన్ని. ఇప్పుడు అరకిలో కొని జాగ్రత్తగా వాడుకుంటున్నాం. ఈ ధరలు ఎప్పుడు తగ్గుతాయో...

-రాజ్యలక్ష్మి, గోపాలపట్నం

వైద్య శిబిరాలతో మేలు

- డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



డిప్యూటీ మేయర్ శ్రీధర్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

విశాఖ విద్య: వర్షాకాలం ప్రారంభమవుతున్నందున వ్యాధుల నివారణకు ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌ల నిర్వాహకులు కాలనీల్లో వైద్య శిబిరాల నిర్వహణకు ముందుకు రావాలని నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 52వ వార్డు కరాస జీవీఎంసీ హైస్కూల్ ప్రాంగణంలో ప్రైవేటు ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జీవీఎంసీ ద్వారా విస్తృత కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇదే సమయంలో ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌ల నిర్వాహకులు కూడా కాలనీల్లో సేవా భావంతో వైద్య శిబిరాలు నిర్వహిస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసే వారికి తగిన సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

విమల విద్యాలయం ఉపాధ్యాయుల దీక్షకు మద్దతు

ఉక్కునగరం: స్థానిక విమల విద్యాలయం ఉపాధ్యాయులకు పాఠశాల పూర్వ విద్యార్థులు మద్దతు తెలిపారు. ఈ మేరకు పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల వద్ద ఉపాధ్యాయులను కలిసి తాము అండగా ఉంటామన్నారు. ఎన్నో వేల మందిని తీర్చిదిద్దిన పాఠశాల ఉపాధ్యాయులకు నష్టం జరిగితే సహించబోమన్నారు. గొల్లవిల్లి కనక భవాని, రామ్మోహన్ కుమార్, బలిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



గౌరీ సంక్షేమ సమితి నూతన కార్యవర్గ సభ్యులు

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్‌లోని శ్రీగౌరీ డిగ్రీ కళాశాలలో ఆదివారం గౌరీ సంక్షేమ సమితి 2024–26 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించినట్లు ఎన్నికల అధికారి ఆడారి నళిని తెలిపారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా డాక్టర్ ఎం.చంద్రశేఖర్ రావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్‌గా పి.సన్యాసిరావు, కోశాధికారిగా ఎస్.జగ్గ అప్పారావు, డైరెక్టర్లుగా ఎ.వి.ప్రసాద్, సిహెచ్.అప్పారావు, పి.రామారావు, ఆర్.రామారావు, బి.వి. సత్యనారాయణ, ఎస్.సత్యనారాయణ, బి.వెంకటరావు, బి.రామచంద్రరావు, డి.శ్రీరామకృష్ణలు ఎన్నికైనట్లు ఆమె చెప్పారు. ఈ సందర్భంగా కొత్త కార్యవర్గ సభ్యులను పలువురు సమితి సభ్యులు అభినందించారు.

హెచ్‌ఆర్‌సీఐ జాతీయ కన్వీనర్‌గా ఆల్ఫా కృష్ణ



ఆల్ఫా కృష్ణ

విశాఖ విద్య: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా జాతీయ కన్వీనర్‌గా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ నియమితులయ్యారు. హెచ్‌ఆర్‌సీఐ జాతీయ అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీకాంత్ ఈ మేరకు ఆదివారం వెల్లడించారు. నిరుపేదలకు తోచిన రీతిలో సాయమందించడమే కాకుండా, అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున కృష్ణను హెచ్‌ఆర్‌సీఐ కన్వీనర్‌గా ఎంపిక చేసినట్లు సంఘం జాతీయ కార్యదర్శి నందం నరసింహారావు తెలిపారు. నగరంలోని స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో భవిష్యత్‌లో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా కృష్ణ చెప్పారు.

మర్యాద పూర్వక కలయిక



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న యాదవ సంఘం ప్రతినిధులు

మల్కాపురం: విశాఖ జిల్లా యాదవ సంఘం ప్రతినిధులు గాజువాక ఎమ్మెల్యే,టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పారిశ్రామిక ప్రాంతంలో యాదవ సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు.పల్లా శ్రీనివాసరావును కలిసిన వారిలో యాదవ సంఘం ప్రతినిధులు ఉరుకూటి గోపీయాదవ్,బొట్ట వెంకటప్పారావు యాదవ్,పల్లా సాగర్‌యాదవ్,పల్లా హరి యాదవ్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పాదపూజ



లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద మహాస్వామికి పాదపూజ చేస్తున్న భక్తులు

సీతంపేట: శ్రీలలితా పీఠాధిపతి, కుర్తాళం శంకరాచార్య సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి పాదచరణాలకు భక్తులు పాదపూజ నిర్వహించారు. లలితానగర్‌లోని పీఠం దర్బారు హాల్‌లో ఆదివారం ఉదయం పండితుల వేద మంత్రాల నడుమ భక్తిశ్రద్ధలతో పాదపూజ చేశారు. అనంతరం స్వామీజీ భక్తులను ఆశీర్వదించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి దర్శనం కోసం విచ్చేశారు. పలువురు భక్తులు మంత్రోపదేశం తీసుకున్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రభుత్వ బడులను పరిరక్షించుకోవాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అంబేద్కర్

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టీఆర్ అంబేద్కర్ అన్నారు. జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం ఎన్ఏడీలోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. 'ప్రభుత్వ బడులు పరిరక్షించుకుందాం–పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిద్దాం' పేరిట ముద్రించిన కరపత్రాలను సంఘం నాయకులతో కలసి రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించే విధంగా వారి తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతీ ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు పైడిరాజు, ఉమాదేవి, రాంబాబు, సత్యం, రాము, రిజ్వాన్, రియాజ్ జిల్లాలోని 11 మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సింహాచలం దేవస్థానానికి వీల్‌చైర్స్ బహూకరణ



వీల్‌చైర్స్ అందిస్తున్న వైజాగ్ మెడికల్ సిండికేట్ సభ్యులు

సింథియా: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా నడవలేని భక్తుల సౌకర్యార్థం వైజాగ్ మెడికల్ సిండికేట్ (హిందూస్తాన్ షిప్‌యార్డ్ కాలనీ) ప్రతినిధులు సింహాచలంలోని శ్రీ వరహాలక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి రెండు వీల్ చైర్స్‌ను ఆదివారం బహూకరించారు. సూపరింటెండెంట్ సిరిపురపు కనకరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైజాగ్ మెడికల్ సిండికేట్ యాజమాన్యం, షిప్‌యార్డ్ డీజీఎం కాపు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి



59వ వార్డులో శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



62వ వార్డులో శ్యాంప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మల్కాపురం: సమైక్య భారత్ కోసం ఎంతో శ్రమించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ జిల్లా నాయకుడు పాలిమేర శ్రీనివాసరావు అన్నారు. 59వ వార్డు శాంతిగిరి కాలనీలో ఆదివారం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖర్జీ సేవలను కొనియాడారు. బీజేపీ నాయకులు లక్కరాజు రామకృష్ణ, తెప్పల సతీష్, సాంబశివరావు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ సేవలు ఎనలేనివి

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు అంబేద్కర్ కాలనీలో బీజేపీ వార్డు అధ్యక్షుడు యల్లబిల్లి వెంకటరావు ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమైక్య భారత్ కోసం వీరోచితంగా పోరాడిన శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలను నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి ములకలపల్లి ప్రకాష్, బంగారు లక్ష్మి, భారతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఘంటసాల గానావధానం



ఘంటసాల గానావధానం నిర్వహిస్తున్న డాక్టర్ రహమతుల్లా

సీతంపేట: ఘంటశాల ఆరాధకుల టెలిగ్రామ్ గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన ఘంటసాల ఆరాధనోత్సవాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వైద్యుడు సయ్యద్ రహమతుల్లా నిర్వహణలో గాయనీగాయకులు పాత పాటలను మధురంగా పాడారు. టెలిగ్రామ్ గ్రూప్ సభ్యులు రెండు గ్రూపులుగా ఏర్పడి చెడుగుడు ఆట తరహాలో పాటలకు లయబద్ధంగా స్టెప్పులు వేస్తూ ప్రేక్షకులను ఆనంద పరవశులను చేశారు. ఈ సందర్భంగా సోమయాజుల సత్యవాణి, హెచ్.సావిత్రి, సిహెచ్.నంద గోపాల్ ప్రదర్శించిన ఘంటసాల లఘు నాటికలు ప్రేక్షకులను మైమరపింపజేశాయి. గానలహరిలో గాయనీ గాయకులు డాక్టర్ కె.రామ్మూర్తి, ఎం.ఎస్.వి.సుబ్బారావు, జి.నానాజీ, కె.రాజేంద్ర ప్రసాద్, బెహరా మురళి, బి.కల్యాణి, ఎస్.రేణుక ఆలపించిన ఘంటసాల పాటలు ఉర్రూతలూగించాయి. చివరగా డాక్టర్ రహమతుల్లా నిర్వహించిన ఘంటసాల గానావధానం ప్రక్రియ తీరు ఆకట్టుకుంది. వ్యాఖ్యాతగా మేడా మస్తాన్ రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో డాక్టర్ జి.మహేష్, జి.వి.రావు, కె.రంగారావు పాల్గొన్నారు.

గురుకులంలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

సబ్బవరం: సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6,7,8,9వ తరగతుల్లో ఎస్సీ కేటగిరీలో మిగిలిపోయిన సీట్లు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా విద్యార్థి ఆధార్, క్యాస్ట్ సర్టిఫికెట్‌తో వచ్చి స్థానిక గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 28న దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సబ్బవరం గురుకుల పాఠశాలలో ఉదయం 10 నుండిచి 12 గంటల వరకూ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు.మరిన్ని వివరాలకు 80084 69493 నంబర్‌లో సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

మళ్లీ మొరాయించిన లిఫ్ట్



దువ్వాడ రైల్వేస్టేషన్‌లో పనిచేయని లిఫ్ట్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్ ఫామ్ వైపు ఉన్న లిఫ్ట్ మళ్లీ మొరాయించింది. మరమ్మతులు చేసిన పది రోజులకే పాడైపోయింది. మరో వైపు తరచూ లిఫ్ట్ మొరాయిస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో దువ్వాడ రైల్వేస్టేషన్ ఆవరణలోని లిఫ్ట్, కోచ్ ఇండికేటర్లు మొరాయిస్తున్నాయి. నిర్వహణా లోపం కారణంగా లిఫ్ట్ అలకపాన్పు వహిస్తుందని ప్రయాణికులు చెబుతున్నారు. లగేజీలు, పిల్లలతో మెట్లు ఎక్కలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి లిఫ్ట్ మొరాయించడంతో ప్రయాణికులు తిట్టుకుంటూ లగేజీలు మోసుకొని వెళ్తున్న పరిస్థితి కనిపించింది.

దివ్యాంగులకు సరకులు, దుప్పట్ల పంపిణీ



నిత్యావసర సరకులు అందజేస్తున్న ఎమ్మెల్యే గణబాబు, కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: పేదలకు సాయం చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ పుట్టిన రోజు పురస్కరించుకొని ఆదివారం పేదలు, దివ్యాంగులకు నిత్యావసర సరకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టిన రోజు నాడు ఇలాంటి సేవా కార్యక్రమాలను చేసేందుకు ప్రతీ ఒక్కరూ ముందుకురావాలన్నారు. జీవీఎంసీ షెల్టర్‌ను సందర్శించి వృద్ధులు, నిరాశ్రయులకు కార్పొరేటర్ బొమ్మిడి రమణ వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దాడి వెంకటరమేష్, సరగడం రాజశేఖర్, గల్లా చిన్న, రాపర్తి కన్నా, బల్లా శ్రీను, పీవీ నరసింహం, కవితా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం జ్యేష్ఠ శుద్ధ పాడ్యమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ. 50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

కేవీ-2లో ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభం



ఇండక్షన్ కోర్సులో పాల్గొన్న ఉపాధ్యాయులు

సింథియా: సింథియా సమీప నౌసేనబాగ్‌లోని కేంద్రీయ విద్యాలయం–2లో కొత్తగా నియమితులైన ప్రాథమిక ఉపాధ్యాయులకు ఐదు రోజుల ఇండక్షన్ కోర్సు ఆదివారం ప్రారంభమైంది. ముఖ్య అతిథి కేంద్రీయ విద్యాలయ సంఘం డిప్యూటీ కమిషనర్(రిటైర్డ్) ఎ.వి.ఎల్.జగన్నాథరావు నూతన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. గౌరవ అతిథి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ నరసింహకుమార్ పలు అంశాలపై మాట్లాడారు. కేవీ–2 ప్రిన్సిపాల్ ప్రారంభ ఉపన్యాసమిచ్చారు. ఈ కోర్సులో కొత్తగా నియమితులైన ప్రాథమిక ఉపాధ్యాయులకు ఎన్ఈపీ–2020లో రూపొందించిన అనేక అంశాలను పరిచయం చేశారు. నిపున్ భారత్, కోడ్ ఆఫ్ కండక్ట్, క్లాస్‌రూమ్ మేనేజ్‌మెంట్, కేంద్రీయ విద్యాలయంలో ప్రతి రోజు జరిగే వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం–1 ప్రిన్సిపాల్ సుధీర్ కుమార్, కేంద్రీయ విద్యాలయం–2 హెచ్ఎం వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రక్షక్ డ్రైవర్‌కు ద్వారకా పోలీసుల ఆర్థిక సాయం



సురేష్‌కు రూ.30 వేలు అందజేస్తున్న సీఐ రమేష్, ఎస్ఐలు, సిబ్బంది

సీతమ్మధార: రోడ్డు ప్రమాదంలో కుమార్తెను కోల్పోయిన కమ్యూనిటీ హోం గార్డు డ్రైవర్ కుటుంబానికి ద్వారకా స్టేషన్ పోలీసులు బాసటగా నిలిచారు. ఈ స్టేషన్ రక్షక్ వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్న బి.సురేష్ కంచరపాలెం జాషువానగర్‌లో భార్య, కుమార్తెలతో కలిసి నివసిస్తున్నారు. శుక్రవారం రాత్రి సురేష్ తన కుమార్తె పూజిత(9)తో కలిసి రైల్వే న్యూకాలనీ వెళ్లి తిరిగి వస్తుండగా తాటిచెట్లపాలెం జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమార్తె మరణించడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ నేపథ్యంలో సురేష్ కుటుంబానికి ద్వారకా జోన్ పోలీస్ అధికారులు, సిబ్బంది ఆర్థిక సాయం చేశారు. ఆదివారం స్టేషన్‌లో ద్వారకా సీఐ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐలు ధర్మేంద్ర, శ్రీను, సిబ్బంది రూ.30 వేలను సురేష్‌కు అందించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ డి.వి.రత్నం, హెచ్‌సీలు శంకర్, కె.శ్రీను, సిహెచ్.శ్రీను, రామ్మూర్తిరాజు, పీసీలు ఎస్.రమేష్, కె.టి.వి.రమేష్, శ్రావణి పాల్గొన్నారు.

కేంద్రం ఆంక్షలతోనే స్టీల్‌ప్లాంట్‌కు ముప్పు



దీక్షా శిబిరంలో మల్లయ్య, తౌడన్న, ఆదినారాయణ

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం పగబట్టిందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు బి.మల్లయ్య, తౌడన్న ఆరోపించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. 1228వ రోజు దీక్షా శిబిరంలో ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత గనులు లేకపోయినా సామర్థ్యానికి మించి ఉత్పత్తులు సాగించిన ఘన కీర్తి విశాఖ ఉక్కు సొంతమన్నారు. విశాఖ ఉక్కు సామర్థ్యాన్ని పెంచేందుకు డీపీఆర్ సిద్ధంగా ఉన్న పరిస్థితుల్లో కేంద్రం తన అనుయాయులకు కర్మాగారాన్ని అప్పగించాలనే కుట్రతో విష ప్రచారం మొదలు పెట్టి ప్రైవేటీకరణకు తెరలేపిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో విశాఖ ఉక్కును కొనసాగిస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కర్మాగారం కోసం ప్రాణ త్యాగాలు చేసిన అమరుల త్యాగానికి ఫలితం ఉంటుందని, వేలాది ఎకరాలు నామమాత్రపు ధరకు అప్పగించిన నిర్వాసితుల త్యాగానికి గౌరవం ఉంటుందన్నారు.